రక్తం తాగే పిశాచం

వసుంధర

(గత సంచిక తరువాయి)

"అయాం ప్రొఫెసర్ మహదేవుడు — మేమే మీ దగ్గరకు రావాలనుకుంటున్నాం. కొన్ని విచిత్ర పరిస్థితుల్లో మేమీ వేషాలు వేయాల్సివచ్చింది. అదిగో

అక్కడ నిలబడిన ఆమె మనిషి కాదు. ఒక మానవాతీత శక్తి. మంత్రశక్తులతో ఆమెను బంధించాం. ఈ ఇంట్లో ఆమె చాలా ఘోరాలు చేసింది...." అన్నాడు మహదేవుడు.

"నాన్సెన్స్—" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఇన్స్పెక్టర్—" అంది వకుళ—"నేను సామాన్యురాలిని. వీళ్ళే మంత్రగాళ్లు. ఏం మంత్రమో వేసి నా చుట్టూ ఈ గీతాలు గీశారు. నేను బయటకు రాలేక పోతున్నాను. ఈ యింట్లోనే వీళ్ళు చాలా హత్యలు చేశారు. అవన్నీ నాకు అంటగట్టాలని చూస్తున్నారు. మీరే నన్ను రక్షించాలి—"

అప్పటికి ఇన్స్పెక్టర్ అక్కడ వున్న నాలుగు శవాలనూ, అవి వున్న పరిస్థితులనూ చూసి — "మై గాడ్!" అన్నాడు. సూర్యావతి ఆత్రుతగా తన కొడుకు శవం దగ్గరకు పరుగెత్తి ఘొల్లుమన్నది.

"తమ ఓడ్డ మాయమయిందనీ — తనకీ యింటివారిపై అనుమానమున్నదనీ చెబితే మేమిక్కడకు వచ్చాం. కానీ ఇక్కడ ఇంత ఘోరం జరిగిపోతుందనుకోలేదు—" అన్నాడు ఇన్స్పెక్టర్ — "ఈ ఘోరం ఒక్క వనిత చేసిందంటే నమ్మకంగా లేదు. ఇదంతా మీరే చేసి వుండాలి" అంటూ అతను కానిస్టేబుల్సును చుట్టుముట్టమన్నాడు.

"అయ్యో ఇన్స్పెక్టర్ — మీకు వకుళ గురించి తెలియదా?" అన్నాడు శివశంకరం.

"వకుళ—ఆ పేరు విన్నాను. అయితే అలాంటి కాకమ్మ కథలు నేను నమ్మను. ఈమెను హిప్నటైజ్ చేసి చుట్టూ గీతలు గీసి మంత్రించామని మోసం చేస్తున్న

మీ ప్రతిభకు జోహార్లు. నే నిప్పుడామెను బయటకు తీసుకు వస్తాను. మీ అసలు బండారం బయట పెట్టి స్తాను—" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"ఇన్ స్పెక్టర్—తొందరపడవద్దు. ఒక్క నిముషం మా మాట వినండి. ఆమెను విడిపించారంటే ఇంక మనమేమీ చేయలేము. ఎంతో కష్టపడి ఆమె ఉనికి తెలుసుకుని ఇప్పటి కిక్కడ బంధించాము. మీ రనుకుంటు న్నట్లు ఆమె మనిషి కాదు. మానవాతీతశక్తి—" అంటూ అరిచాడు మహాదేవుడు.

"నాన్సెన్స్—అది మానవాతీత శక్తి అయినా నా చేతిలో రివాల్వరున్నంత సేపు నాకేం భయంలేదు—" అంటూ ఇన్ స్పెక్టర్ ఓ అడుగు ముందుకు వేసి-"మంత్రిం చిన ఈ వలయాన్ని నేను తుడిచివేస్తున్నాను. నువ్వు బయటకు రా అమ్మా—" అన్నాడు. వకుళ అతడివంకే ఆత్రుతగా చూస్తోంది.

మహాదేవుడు, శివశంకరం, లింగం—అరుస్తున్నా వినకుండా ఇన్ స్పెక్టర్ ఆ వలయాన్ని కొంతమేర తడి చేశాడు. వకుళ వెంటనే ఉత్సాహంగా ఆ దారిలోంచి బయటకు వచ్చి ముందుకు పోబోయింది.

"ఆగు—యెక్కడికి వెడతావ్?" అన్నాడు ఇన్ స్పెక్టర్.

వకుళ ఆగలేదు. త్వరగా ఆ ఆంజనేయుళ్ళ రూపాల నుంచి బయటపడాలని చూస్తోందామె.

"ఏయ్—ఆగమంటే నీక్కాదూ?" అన్నాడు ఇన్ స్పెక్టర్.

వకుళ ఆగి వెనక్కి చూసి—"సారీ—ఇన్ స్పెక్టర్! థాంక్స్ చెప్పడం మరచిపోయాను—" అంది.

"థాంక్స్ కాదు నా క్కాకవలసింది. నువ్వెవరివో—ఇక్కడెందుకున్నావో చెప్పాలి—" అన్నాడు ఇన్స్పెక్టర్ ముందడుగు వేస్తూ. అతడు రివాల్వర్ సరిచేసి పట్టుకున్నాడు.

"నా పేరు వకుళ. నేను మానవాతీత శక్తిని. పగ తీర్చుకుందుకు యిక్కడికి వచ్చాను. ఇక్కడ చచ్చిన వాగంతా నా కారణంగానే చచ్చారు. ఆ పిచ్చి ప్రొఫెసర్నీ, అతడి బృందాన్నీ వదిలిపెట్టు" అంటూ ముందడుగు వేసింది వకుళ.

"ఆగు—" అరిచాడు ఇన్స్పెక్టర్.

"నన్నెవరూ ఆపలేరు—" వకుళ పరుగెత్తింది.

ఇన్స్పెక్టర్ రివాల్వర్ పేల్చాడు. వకుళ ఆగలేదు. మళ్ళీ పేల్చాడు. వకుళ వీధిలోకి వెళ్ళిపోయింది.

"పరుగెత్తు ఇన్స్పెక్టర్. మమ్మల్ని కూడా వదులు. ఆమెను ఆపడం కష్టం. మా కష్టం అంతా నీ కారణంగా బూడిదలో పోసిన పన్నీరయింది—" అన్నాడు మహదేవుడు.

అంతా వీధిలోకి పరుగెత్తి జీపులో కూర్చున్నారు.

ఇంట్లో సూర్యావతి పిల్లాడి ముందు రోదిస్తోంది. మతి లేకుండా ఆమె పక్కన ఉన్నాడు షణ్ముఖరావు.

వీధిలో జీపు కదిలింది. ముందు వకుళ పరుగుతుతోంది.

టైం రాత్రి పదకొండున్నర దాటింది.

వీధులు నిర్మానుష్యంగా వున్నాయి.

వీధిలో వకుళ పరుగెడుతోంది. జీపు ఆమెను తరుముతోంది.

కొంతదూరం వెళ్ళాక వకుళ ఆగి జీపు కెదురుగా నిలబడింది.

ఇన్‌స్పెక్టర్ బ్రేకువేసి జీపు ఆపాడు.

వకుళ ముందరికి నడిచింది. వాళ్ళు జీపు దిగుతూండ గానే ఆమె జీపును కాలితో ఒక్క తాపు తన్నింది. అంతే—జీపు తల్లక్రిందులైంది.

వకుళ మళ్ళీ పరుగెత్తసాగింది.

"ఆమె శక్తి అపారం—చేతనైతే గట్టిగా ఆంజనేయ దండకం ఆరంభించండి—అదొక్కటే ఆమెను అణచి ఉంచగలదు—" అంటూ మహదేవుడు గట్టిగా దండకం ప్రారంభించాడు.

జీపు నలాగే వదిలి—అంతా వకుళను అనుసరించ సాగారు.

ఈలోగా వకుళకు యెదురుగా ఓ పెద్ద ట్రక్కు వచ్చింది. దాన్నామె అవలీలగా రెండు చేతుల్తో పైకి లేపి—దారికి అడ్డంగా పడేసింది. తను ముందుకు కొనసాగి పోయింది.

"మొగాడ్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్. అప్పటికి అతడికి వకుళ శక్తి పూర్తిగా అర్థమయింది—"నన్ను క్షమించాలి మీరు ముగ్గురూ—" అన్నాడతను.

ఎలాగో వారు ట్రక్కుని దాటి ముందుకు వెళ్ళి పోయారు.

వకుళ పరుగెడుతోంది—దారి పొడుగునా నానా భీభత్సం చేస్తూ.

ఏ రిక్షాయైనా, కారైనా ఎదురైతే ఎత్తి వాళ్ళ మీదకు విసిరేస్తోంది. ఎలక్ట్రిక్ సంబాలు పీకేస్తోంది. చెట్లు విరిచేస్తోంది. తను ముందుకు కొనసాగిపోతోంది.

అంత శక్తి గల ఆమెను ఆపడం యెలాగో ఇన్

స్పెక్టర్‌కి తెలియడంలేదు.

మహాదేవుడు, లింగం, శివశంకరం ఆయాసపడుతున్నారు.

"ఆమెతో మనం పరుగెత్తలేం!" అన్నాడు శివశంకరం.

"మనం లేకపోతే ఎలా? ఆంజనేయ చక్రంలో మనం బంధించాలా మెను—ఇన్‌స్పెక్టర్ యేమీ చేయలేడు" అన్నాడు మహాదేవుడు.

వకుళ ఉన్నట్లుండి దారి మళ్ళించింది. ఆమె రోడ్డు పక్క ముళ్ళబాటలోకి మళ్ళింది.

ముళ్ళామె కాళ్లను బాధించడం లేదు.

మహాదేవుడు, లింగం, శివశంకరం—హనుమంతుడి వేషాల్లో వున్నారు. వాళ్ళ కాళ్ళకు జోళ్ళు లేవు. రక్తం ప్రవహిస్తూంటే వాళ్ళు తెగించి ఆ దారిలో పరుగెడుతున్నారు. క్షణం ఆగడానికి లేదు.

వకుళ అలా పరుగెత్తి ఉన్నట్లుండి కీచుమంటూ అరిచి పడిపోయింది.

ఇన్‌స్పెక్టర్, లింగం, శివశంకరం, మహాదేవుడు—మొత్తం అందరూ కాస్త దూరంగానే ఆగిపోయారు.

పడిపోయిన వకుళలో క్రమంగా చలనం స్తంభించింది.

అంతా నెమ్మదిగా ఆమెను సమీపించారు.

వకుళ ఇప్పుడు పడిపోయిన స్త్రీమూర్తిలా లేదు. శవంలాగుంది.

"ఆమె చనిపోయిందా?" అన్నాడో కానిస్టేబులు.

ఇన్‌స్పెక్టర్ వంగి—ఆమె చేయి పట్టుకుని-"బాప్ రే-యెంత చల్లగా వుందీ?" అన్నాడు.

కానీ వకుళ ఇంత అర్ధాంతంగా ఎందుకు నిర్జీవురా

లైందో మహాదేవుడికి అర్థంకాలేదు. ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించాడు. ఆమె శరీరానికి సమీపాన ఒక తులసి మొక్క వున్నది.

'తులసి మొక్కకు ఈమెను నిర్జించే శక్తి ఉన్నదా?' అని ఆలోచించసాగాడు మహాదేవుడు.

"అసలీమె కథేమిటో చెప్పండి సార్ —" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆయాసాన్ని భరిస్తూ.

ఒక్క నిముసం విశ్రాంతి తీసుకుని క్లుప్తంగా వకుళ కథ చెప్పాడు మహాదేవుడు.

"తులసి మొక్కకు ఈమెను నిర్జించే శక్తి వున్నదని నేననుకోను—" అన్నాడు శివశంకరం.

సరిగ్గా అప్పుడే దూరంగా వస్తున్న ఓ స్త్రీమూర్తి వారికి కనిపించింది. కొంత దగ్గరగా వచ్చి అక్కడి పోలీసుల్ని చూసి ఆమె పరుగెత్తి పారిపోయింది.

ఇద్దరు కానిస్టేబుల్సు ఆమెను పట్టుకుని లాక్కుని వచ్చారు.

"ఎవర్నువ్వు?" గద్దించాడు ఇన్‌స్పెక్టర్.

"నా పేరు మంగమ్మ—" అన్నదామె — అప్పుడే ఆమె అక్కడ పడివున్న వకుళ శవాన్ని చూసి—"సరిగ్గా ఇక్కడే...." అంటూ ఏమో గొణిగింది.

అప్పుడే లింగం టైం చూసి — "సరిగ్గా పన్నెండూ అయిదయింది. అంటే వకుళ జీవితం ఒక అమావాస్య నాటి రాత్రి పన్నెండు గంటలకు ఆరంభమై — మరో అమావాస్యనాటి రాత్రి పన్నెండుకు అంతమైనదన్న మాట — ఆమె మరణానికి కారణం ఆ సమయమే అయుంటుంది—...." అన్నాడు.

"అసంభవం—అలాగైతే ఈ మధ్యలో ఇంకా చాలా

అమావాస్యలొచ్చాయి—" అన్నాడు శివశంకరం.

ఒకవేళ తమ మందు ప్రభావం అయిపోయి ఆమె మరణించిందేమోనని లింగానికి అనుమానంవచ్చి మహాదేవుడి చెవులో గొణిగాడు.

"ఏమిటి—సరిగ్గా—ఇక్కడే—....అంటున్నావు...." అన్నాడు ఇన్స్పెక్టర్.

"సరిగ్గా ఇక్కడే....ఇక్కడే...." అంటూ ఏడ్వసాగింది మంగమ్మ.

"ఏమిటి—సరిగ్గా చెప్పు!" గద్దించాడు ఇన్స్పెక్టర్.

"సరిగ్గా ఇక్కడే .... మధుబాబు...." మంగమ్మ మళ్ళీ ఆగింది. క్రూరంగా చూస్తున్న ఇన్స్పెక్టర్ వంక భయంగా చూసి — "మధుబాబు ఇంట్లో మహిమగల కంకం వుంది. అదంతా ఓ పెట్టెలోకి మార్చి ఇక్కడ పాతిపెట్టాను. గుర్తుగా పైన ఓ తులసి మొక్క పాతాను. ఆ కంకం అంటే ఈ అమ్మకు భయం. కానీ చివరకి వెతుక్కుంటూ వచ్చి ఈ కంకంమీదనే చచ్చిపోయింది" అంది.

మహాదేవుడు, శివశంకరం, లింగం—ఉలిక్కిపడ్డారు.

ఏమిటీ చిత్రం? ఒక బైరాగి ఆమె ఉనికిని ఊహించి ఇచ్చిన కంకం—చివరికామెను తన వైపుకి ఆకర్షించుకుని అంతంచేసింది! ఇదంతా ఆ బైరాగి ముందే ఊహించాడా? అసలా బైరాగి ఎవడు?

ఈ సృష్టిలో అన్ని ప్రశ్నలకూ సమాధానాలుండవు. కానీ ఒక విచిత్రమైన శక్తి ఈ సృష్టిని నడుపుతోంది. అందువల్లనే అప్పుడప్పుడు దుష్టశక్తులు విజృంభించినా వాటిని ఆ విచిత్ర శక్తి మళ్ళీ అణగివేస్తుంది. అయితే దుష్టశక్తులు అప్పుడప్పుడు ఎందుకు విజృంభిస్తాయి?

కేవలం మనిషి కారణంగా....

అసహాయుల్ని హింసించడం మనిషి అలవాటు. అసహాయుల్ని తయారు చేయడం మనిషి మెదడు హాబీ. అసహాయులు అసహాయులే అయినా వారికి మెదడు వుంటుంది. అది విపరీతమైన మార్గాలు తొక్కుతుంది. ఏదో ఒక రోజున మనిషి దుష్టశక్తిగా మారతాడు.

దుష్టశక్తుల్ని విజృంభించకుండా చేయగలవాడు మనిషి మాత్రమే! అయితే మనిషి అందుకు ప్రయత్నించడు.

అమాయకురాలైన వకుళ దుష్టశక్తిగా మారి కొన్ని ఘోరాలు చేసి ప్రస్తుతానికి నిద్రపోతోంది. అయితే అది నిద్రిస్తున్న దుష్టశక్తి మాత్రమే! ఏదో ఒకరోజున ఎవరో ఒకరు ఆ దుష్టశక్తిని మేల్కొల్పే అవకాశం వున్నది.

అటువంటి అవకాశం రాకూడదనే మనం కోరుకుందాం. కానీ అవకాశం వున్నదని మాత్రం మనం మరువకూడదు.

—:ఐ పో యిం ది:—